సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 26 । నవంబర్ । 2023



భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి

నెల్లూరు (బృందావనం): శనిత్రయోదశి సందర్భంగా కృష్ణయోగ మందిర నాగేశ్వర స్వామి ఆలయంలో శనైశ్చర స్వామికి శనివారం తైలాభిషేకాలు నిర్వహించారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,520
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,710
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,881
నవర (8 గ్రాములు)	రూ.47,048

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.7 /24.0

గాలిలో తేమ శనివారం 77 శాతంగా నమోదైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

జలాశయానికి పెరుగుతున్న ఇన్‌ఫ్లో



సోమశిల జలాశయంలో నీటి నిల్వ

సోమశిల: సోమశిల జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో రోజురోజుకు పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతోనే ఇన్‌ఫ్లో పెరుగుతున్నట్లు జలాశయ అధికారులు చెపుతున్నారు. శుక్రవారం 173 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో శనివారం నాటికి 1752 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 29.397 టీఎంసీలకు చేరింది. జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు 25 క్యూసెక్కులు (లీకేజీ), ఉత్తర కాలువకు 40, దక్షిణ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 91.434 మీటర్ల మట్టం నమోదు అయింది.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

నెల్లూరు సిటీ: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కమ్యూనిటీ పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులకు డీఎంఅండ్‌హెచ్‌ఓ పెంచలయ్య సూచించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో శనివారం సమావేశమైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల నేపథ్యంలో డెంగీ, టైఫాయిడ్, డయేరియా తదితర వ్యాధులు ప్రజలకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఅండ్‌పీహెచ్‌పీడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, కార్యదర్శులు గోరంట్ల శేషయ్య, నాయకులు రమణయ్య, శ్రీనివాసులు, మాలిని, వీరయ్య, రాందాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్‌సేవ



రాపూరు: పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిల కల్యాణం, ఊంజల్‌సేవ వైభవంగా జరిగింది. ఉదయం 4 గంటలకు అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు పూలంగిసేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛారణలతో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం సహస్ర దీపాలంకరణ మండలంలోకి తీసుకువచ్చి ఊంజల్‌సేవ నిర్వహించారు.

సంద్రంలో.. సూర్య

- సాగరంలో తమిళనాడు సోనాబోట్ల ఆగడాలపై నిఘా
- కాకినాడ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన అధికారులు
- దశాబ్దాలుగా ఆంధ్రా మత్స్యకారులపై తమిళ జాలర్ల దాడులు
- సోనాబోట్ల ఆగడాలను పట్టించుకోని గత పాలకులు
- మత్స్యకారుల సమస్యలపై స్పందించిన జగనన్న ప్రభుత్వం
- తమిళ జాలర్ల ఆగడాలను ఎదుర్కొనేందుకు అత్యాధునిక బోటు



అత్యాధునిక బోటు సూర్య-1

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తమిళనాడుకు చెందిన మత్స్యకారులు మన రాష్ట్రం పరిధిలోని జలాల్లోకి ప్రవేశించి ఇక్కడి మత్స్య సంపదను దోచుకుంటున్నారు. అత్యాధునిక బోట్లతో మెరుపు వేగంతో సరిహద్దులు దాటి వచ్చి గద్దల్లా తన్నుకు పోతున్నారు. కేంద్ర మత్స్యశాఖ నిబంధనలను ధిక్కరించి దాడులకు తెగబడుతున్నారు. విలువైన వలలను ధ్వంసం చేస్తున్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ దౌర్జన్యకాండకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం అత్యాధునిక బోటును గస్తీ కోసం ప్రవేశపెట్టింది. ఇకపై సూర్య-1 ప్రత్యేక బోటు నిత్యం గస్తీ నిర్వహించే విధంగా మత్స్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఇప్పటి వరకు ఏం జరిగిందంటే

ఆంధ్రప్రదేశ్ సరిహద్దు సముద్ర జలాల్లో తమిళ జాలర్లు అక్రమంగా చొరబడుతున్నారు. కడలినే నమ్ముకుని సంప్రదాయ వలలతో ఆంధ్రా తీరంలోని తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల మత్స్యకారులు బతుకు పోరాటం చేస్తున్నారు. వీరు వేట సాగించిన మత్స్య సంపదను రెప్ప పాటులో తమిళ మత్స్య దొంగలు దోచుకు పోతున్నారు. తమిళనాడులోని నాగపట్నం, కడలూరు, పాండిచ్చేరిలోని కారైక్కల్ తీర ప్రాంతాల నుంచి మత్స్య సంపద ఎగుమతి అవుతుంది. అక్కడ వ్యాపారులు కొందరు మత్స్యకారులను కూలీలుగా పెట్టుకుని అత్యాధునిక బోట్లు, వలలతో వచ్చి మత్స్య సంపదను కొల్లగొడుతున్నారు. సముద్రంలో వేట సాగించడానికి కేంద్ర మత్స్యశాఖ కొన్ని నిబంధనలు విధించింది. సముద్ర తీర ప్రాంత రాష్ట్రాల మధ్య సరిహద్దులు మీరకూడదనే ఆంక్షలు ఉన్నాయి. ఈ మేరకు సాధారణ తెప్పలు, బోట్లతో సముద్ర తీరం నుంచి 8 కిలోమీటర్ల (5 నాటికల్ మైళ్లు) వరకు చేపల వేట చేసుకోవచ్చు. బోట్ల సామర్థ్యాన్ని బట్టి మరింత ముందుకు కూడా వెళ్లవచ్చు. ఇంజిన్ బోట్లు అయితే 23 కిలోమీటర్ల (12 నాటికల్ మైళ్లు) అవతలే వేట చేసుకోవాలి. అయితే తమిళ జాలర్లు అంతర్ రాష్ట్ర సరిహద్దులు దాటి వస్తున్నారు. నిబంధనల ప్రకారం తీరానికి 12 నాటికల్ మైళ్ల అవతల కాకుండా కేవలం 5 నాటికల్ మైళ్లలోపు వేట సాగిస్తున్నారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని మత్స్యకారులు వేట సాగించే చిన్న బోట్లు, తెప్పలను ఢీకొట్టి మరీ మత్స్య సంపదను దోచేస్తున్నారు. తమిళనాడు రాష్ట్రం కడలూరు బీచ్ నుంచి రాష్ట్రంలోని బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ వరకు సుమారు 160 నాటికల్ మైళ్ల దూరం ఉంది. తిరుపతి జిల్లా తడ నుంచి ప్రకాశం జిల్లా కొత్తపట్నం వరకు తమిళ మత్స్యకారులు దూసుకొస్తున్నారు. ప్రధానంగా తిరుపతి జిల్లా వాకాడు ప్రాంతం గోవిందరావుపట్టపుపాలెం, నెల్లూరు జిల్లా అల్లూరు మండలం ఇస్కపల్లి పట్టపుపాలెం, రామాయపట్నం, చాకిచర్ల పట్టపుపాలెం, ఊర్లపాళెం, పాకల పట్టపుపాలెం, టంగుటూరు మండలం తాళ్ళపాలెం, కొత్తపట్నం బీచ్, మడనూరు ప్రాంతాల్లోనే తమిళ మత్స్యకారులు దాడులకు తెగబడుతున్నారు.

వలలు, మత్స్య సంపద నష్టం

జిల్లాలో సుమారు 1300 మెకనైజ్డ్ బోట్లు, 700 మోటారు లేని బోట్లు ఉన్నాయి. తమిళ జాలర్లు సోనాబోట్లతో చేస్తున్న దాడులతో రాష్ట్ర మత్స్యకారులకు చెందిన లక్షలాది రూపాయల వలలు తెగిపోయాయి. ఆర్థికంగా నష్టపోతున్నారు. మెకనైజ్డ్ బోట్లు వేటాడాల్సిన ప్రాంతంలో సోనాబోట్లతో వేట సాగించడం వల్ల మత్స్య సంపద లేక నష్టపోతున్నామని స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇరు రాష్ట్రాల మధ్య చర్చలకు యత్నాలు

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంది. సముద్ర తీర ప్రాంత నిబంధనలు అతిక్రమించి చేపల వేట సాగిస్తున్న కడలూరు బోట్లను శాశ్వతంగా అడ్డుకుని సమస్య పరిష్కారానికి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. 2019, 2022 సంవత్సరాల్లో రెండుసార్లు మత్స్యశాఖ మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులు సమావేశమయ్యేందుకు ప్రయత్నాలు చేసినా తమిళనాడు ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడంతో చర్చలు నిలిచిపోయాయి.

వైఎస్ జగన్ దయవల్లే

“ దశాబ్దాల కాలంగా తమిళజాలర్లు మన మత్స్య సంపదను దోచుకెళ్తున్నారు. అడ్డుకోబోయిన మన జాలర్లపై దాడులకు తెగబడుతున్నారు. గత ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి జాలర్లకు అన్యాయం జరగకుండా చూడాలని ఆదేశాలిచ్చారు. దీంతో మత్స్యశాఖ అధికారులు చొరవ చూపి గస్తీ కోసం బోటును కేటాయించారు. కాకినాడ నుంచి ప్రత్యేకంగా పంపించారు. ఇకపై తీరంలో నిత్యం గస్తీ నిర్వహించి తమిళ జాలర్ల ఆగడాలను అడ్డుకుంటాం.

కొండూరు అనిల్‌బాబు, ఆఫ్కాఫ్ చైర్మన్

గస్తీకోసం అత్యాధునిక బోటు

దశాబ్ద కాలంగా జరుగుతున్న తమిళ తంబీల ఆగడాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సముద్రంలో గస్తీ కోసం అత్యాధునిక మెకనైజ్డ్ బోటును రంగంలోకి దింపింది. తిరుపతి జిల్లా నుంచి బాపట్ల జిల్లా వరకు దాదాపు నాలుగు జిల్లాల పరిధిలో తీరం వెంబడి నిత్యం గస్తీ తిరుగుతూ తమిళ జాలర్ల రాకను ముందే పసిగట్టి వారి ఆగడాలకు కళ్లెం వేసేలా చేస్తున్నారు. ఆఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అభ్యర్థనల మేరకు రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు కాకినాడ నుంచి ప్రత్యేకంగా మెకనైజ్డ్ నౌకను జిల్లాకు కేటాయించారు. ఇక నిత్యం ఆ బోటు ద్వారా తీరంలో గస్తీ నిర్వహణ జరుగుతుంది. కాకినాడ నుంచి తెప్పించిన బోటుకు అధునాతన హంగులు సమకూర్చారు. ఈ బోటును స్టీల్‌తో తయారు చేశారు. బోటులో 12 మంది కూర్చునే విధంగా ఏర్పాటు చేశారు. గంటకు 8 నాటికల్ మైల్స్ స్పీడ్ వెళ్తుంది.

సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన



రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా చారిత్రాత్మక నిర్ణయాలతో దేశంలోనే ఆదర్శపాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. టీపీగూడూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అసైన్డ్, చుక్కల భూములు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన భూములకు సంబంధించి 247 మంది లబ్ధిదారులకు చెందిన 172 ఎకరాలకు మంత్రి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా పేద రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు వస్తే వారి కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని ఏ ముఖ్యమంత్రి ఆలోచన చేయలేదన్నారు. రైతులకు మంచి చేయడమే లక్ష్యంగా భూములను సాగు చేసుకుంటున్న రైతులకు భూహక్కులు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకే దక్కుతుందన్నారు. తోటపల్లిగూడూరు మండలంలో 51 మంది రైతులకు 20.29 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములకు డీకేటీ పట్టాలు, నిషేధిత జాబితా నుంచి 54 ఎకరాలను తొలగించి 48 మంది రైతులకు పట్టాలు, ఎస్సీ కార్పొరేషన్ భూమి కొనుగోలు పథకం ద్వారా భూములు పొందిన 148 మంది రైతులకు 97 ఎకరాలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పట్టాలను అందించామన్నారు. అర్హులైన పేదలు, రైతులకు యాజమాన్య హక్కులు కల్పిస్తుంటే మాజీ మంత్రి సోమిరెడ్డి కోర్టులకు వెళ్లి అడ్డుకొనే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. సోమిరెడ్డి ఎన్ని కుయుక్తులు పన్నినా పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకోలేడన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యులు ఎంబేటి శేషమ్మ, తోటపల్లిగూడూరు సొసైటీ చైర్మన్ కావల్‌రెడ్డి హరిశ్చంద్రారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు, విత్తనాభివృద్ధి సంస్థ అథారిటీ రాష్ట్ర సభ్యులు కోటా శేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు టంగుటూరు పద్మనాభరెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు.

కండలేరులో 11.128 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 11.128 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి జలాశయానికి 300 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నెరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 235 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'వికసిత్'ను విజయవంతం చేయాలి

- ఇళ్ల నిర్మాణాలు, రీ సర్వే వేగం పెంచండి
- కలెక్టర్లకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు

నెల్లూరు (దర్గామిట్ట): వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 30 లక్షల గృహ నిర్మాణ పట్టాలు పేదలకు పంపిణీ చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో ఫేజ్-2 లో లక్ష్యంగా నిర్దేశించిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియపై కూడా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని భూహక్కు పత్రాలను త్వరితగతిన పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రబీ 2023-24 కంటిన్జెంట్ ప్లాన్ రూపొందించుకొని రైతులు ఇబ్బంది పడకుండా వారికి కావాల్సిన ఎరువులు సరఫరా చేయడానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారులకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, పశుసంవర్ధక శాఖ జేడీ మహేశ్వరుడు, పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సుధాకర్, హౌసింగ్ పీడీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టెలిగ్రామ్ చాటింగ్‌తో చీటింగ్

- కమీషన్ కోసం ఆశపడి మోసపోయిన బాధితురాలు



బాధితురాలు అమీనా

మనుబోలు: కమీషన్ కోసం ఆశపడితే ఉన్నది మొత్తం ఊడ్చేశాడో కేటుగాడు. టెలిగ్రామ్‌లో చాటింగ్ చేస్తూ కమీషన్ ఇస్తామని నమ్మబలకడంతో ఆశపడి ఆన్‌లైన్‌లో రూ.4 లక్షలు పోగొట్టుకుంది ఓ యువతి. ఈ విషయంపై బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగు చూసింది. మనుబోలుకు చెందిన అమీనా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తోంది. ఆన్‌లైన్‌లో చాటింగ్ చేస్తుండగా స్వాతి అనే మరో యువతి పరిచయమైంది. ఆమె ఇచ్చిన లింక్ ద్వారా ఇటీవల టెలిగ్రామ్ గ్రూపుతో జాయినయింది. దాన్లో ఎల్అండ్‌టీపీ పేరుతో ప్రీమియర్ ఎర్నింగ్ గ్రూపులో చాటింగ్ చేస్తుండగా రూ.10 వేలకు ఓ టాస్క్ ఇచ్చారు. దాన్ని విజయవంతంగా పూర్తి చేయడంతో రూ.10 వేలతోపాటు అదనంగా కమీషన్ కలిపి అమీనా అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇలా మూడు దఫాలుగా వేశారు. దీంతో నమ్మకం కలగడంతో కమీషన్‌కు ఆశపడ్డ అమీనా విడతల వారీగా రూ.4 లక్షలు జమ చేసింది. వారిచ్చిన టాస్క్ పూర్తి చేసినా తిరిగి నగదు జమ చేయలేదు. అనుమానం వచ్చి అడగగా మరో రూ.1.50 లక్షలు వేస్తే టాస్క్ పూర్తవుతుందని దానికి రెట్టింపు వస్తుందని తెలిపారు. దీంతో తాను మోసపోయానని తెలుసుకున్న అమీనా పోలీసులను ఆశ్రయించింది. ఈ విషయమై ఎస్సై అజయ్‌కుమార్ మాట్లాడుతూ గుర్తు తెలియని లింక్‌లపై క్లిక్ చేయడం, యాప్‌లలో చాటింగ్ చేయరాదన్నారు. బ్యాంక్‌ల నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఓటీపీలు చెప్పమంటారని అలాంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాధితురాలి ఫిర్యాదుతో మోసం చేసిన వ్యక్తి నుంచి రూ.60 వేలు రికవరీ చేశామని, మిగలిన మొత్తం కూడా వసూలు చేస్తామని తెలిపారు.

వ్యసనాలకు బానిసై.. దొంగలుగా మారి


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

- చోరీ కేసుల్లో ఏడుగురి అరెస్ట్

నెల్లూరు సిటీ: వ్యసనాలకు బానిసలై.. బైక్‌ల చోరీకి పాల్పడుతున్న ఏడుగుర్ని నవాబుపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నగరంలోని నవాబుపేట పోలీస్‌స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బాపట్ల జిల్లా చిన్నగంజానికి చెందిన ఇంద్రకుమార్, జిల్లాలోని ఇందుకూరుపేట మండలం రాముడుపాళేనికి చెందిన సురేష్, బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన రాజశేఖర్ నెల్లూరులో బేల్దారి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా వీరు వ్యసనాలకు బానిసలయ్యారు. సంపాదించగా వచ్చే మొత్తం సరిపోకపోవడంతో బైక్‌ల చోరీలకు పాల్పడసాగారు. ఈ క్రమంలో ఎస్పీ ఆదేశాల మేరకు నవాబుపేట ఇన్‌స్పెక్టర్ బాబీ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా ఉంచారు. ఈ క్రమంలో పక్కా సమాచారంతో బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న ఈ ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తమదైన శైలిలో విచారించగా.. నవాబుపేట, దర్గామిట్ట, నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏడు బైక్‌లను చోరీ చేశామని అంగీకరించారు. అనుమానాస్పదంగా ఉన్న ప్రకాశం జిల్లా సంతనూతలపాడుకు చెందిన పాత నేరస్తుడు చల్లా నరసింహను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వీరి నుంచి ఏడు బైక్‌లు, రూ.1100 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ముగ్గురు గొలుసు దొంగలు..

నగరంలో గొలుసు దొంగతనాలు చేస్తూ తప్పించుకొని తిరుగుతున్న ముగ్గురు యువకులను నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. స్టోన్‌హౌస్‌పేటలోని జీవిగలవీధికి చెందిన సుమన్, శెట్టిగుంటరోడ్డులోని వైటీ నాయుడివీధికి చెందిన శ్యామ్‌సన్, శెట్టిగుంటరోడ్డులోని అరుంధతీయపాళేనికి చెందిన ఓ మైనర్ స్నేహితులు. కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. కొంత కాలంగా వ్యసనాలకు బానిసై గొలుసు చోరీలకు పాల్పడేందుకు ప్రణాళికలు రచించారు. ఈ క్రమంలో నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ముఖాలకు మాస్కులు ధరించి బైక్‌లపై వెళ్తూ మహిళల మెడలో గొలుసులను లాక్కెళ్లేవారు. బాధితుల ఫిర్యాదు మేరకు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులను నవాబుపేట ఇన్‌స్పెక్టర్ బాబీ గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకొని 3.5 సవర్ల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రెండు కేసుల్లో అరెస్ట్ చేసిన నిందితులను కోర్టులో హాజరపర్చారు. మైనర్‌ను జువెనైల్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ బాబీ, ఎస్సైలు శివప్రకాష్, రెహమాన్, సిబ్బంది రత్నయ్య, సురేంద్రబాబు, మస్తానయ్య, వేణు, రమణయ్య, మోహన్‌బాబు తదితరులను డీఎస్పీ అభినందించారు.

‘ఆడుదాం.. ఆంధ్రా’కు రేపట్నుంచి రిజిస్ట్రేషన్లు

నెల్లూరు(బారకాసు): ‘ఆడుదాం.. ఆంధ్రా’ టోర్నీకి సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలో శనివారం నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. టోర్నీని డిసెంబర్ 15 నుంచి జనవరి 26 వరకు నిర్వహించనున్నారని ప్రకటించారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖోను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆసక్తి గల క్రీడాకారులు, ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదనపు కమిషనర్ శర్మద, టీపీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వికాస్ మర్మత్

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను ఆదివారం యథావిధిగా చెల్లించొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేయనున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి మృతి

మనుబోలు: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. మండల పరిధిలోని కాగితాలపూరు దళితవాడకు చెందిన శరణ్య (22) అమ్మ, అమ్మమ్మతో కలిసి ఉంటున్నారు. హైవే క్రాస్‌రోడ్డు వద్ద పెట్రోల్ బంక్‌కు అనుబంధంగా ఉన్న ఓ హోటల్లో పనిచేసేవారు. ఈ క్రమంలో పది రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందును జ్యూస్‌లో కలుపుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీంతో శరణ్యను మొదట మనుబోలు ఆస్పత్రికి.. అనంతరం గూడూరు తీసుకెళ్లి కుటుంబసభ్యులు చికిత్స చేయించారు. బాగా ఉందనుకున్న సమయంలో మళ్లీ నలతగా ఉండటంతో వివిధ ఆస్పత్రుల అనంతరం చెన్నై తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా తాము ఇల్లు కట్టుకునే సమయంలో అప్పుల పాలవడంతో ఆ దిగులుతో తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడ్డారని తల్లి తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా మండల పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో మండల పూజలను విశేషంగా నిర్వహిస్తున్నారు. అయ్యప్ప మాలధారులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా అంకయ్య, సరస్వతి, ప్రసాద్, మాధవి, కడప ప్రభాకర్, పెంచలమ్మ, నల్లపరెడ్డి శ్రీలక్ష్మమ్మ వ్యవహరించారు.

కోటమిట్టలో చోరీ

నెల్లూరు సిటీ: నగరంలోని కోటమిట్టలో చోరీ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని కోటమిట్టలో గల పాత క్వార్టర్స్‌లో నర్సు విజయలక్ష్మి ఒంటరిగా ఉంటున్నారు. ఒంగోలులో బంధువుల ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో ఈ నెల 22న ఆమె వెళ్లారు. ఆ సమయంలో హడావుడిలో ఇంటికి తాళం వేయడాన్ని మరిచారు. ఈ క్రమంలో ఆమె మేనల్లుడు యుగంధర్ రాగా, ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని గుర్తించారు. విషయమై తన అత్తకు ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. హుటాహుటిన ఆమె నెల్లూరు చేరుకున్నారు. రెండు కిలోల వెండి వస్తువులు చోరీకి గురవ్వడాన్ని గమనించి చిన్నబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం జ్వరాలు వచ్చే అవకాశం ఉన్న తరుణంలో గ్రామాల్లో పర్యటించి ఫీవర్ సర్వేను నిర్వహించాలని ఆదేశించారు. మలేరియా, డెంగీపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం తగదని పేర్కొన్నారు. డాక్టర్ సయ్యద్ అహ్మద్‌బాబు, సీహెచ్‌ఓ సుబ్బమ్మ, డాక్టర్లు వినయ్‌కుమార్, ప్రత్యూష, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

మహా కార్తీక దీపోత్సవం నేడు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన సమీపంలో గల గణేశ్ ఘాట్ వద్ద మహా కార్తీక దీపోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నామని సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షురాలు డాక్టర్ వెన్నెల పేర్కొన్నారు. ఏర్పాట్లను శనివారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఉదయం ఆరు గంటలకు గోపూజ, తాత్కాలిక అరుణాచలేశ్వర స్వరూప మహాలింగం, శివపార్వతులు, సీతారామచంద్రమూర్తి, రుక్మిణీ, సత్యభామ సమేత కృష్ణుడు తదితర ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని కోరారు. కార్యదర్శి బయ్యా మల్లిక, పర్యవేక్షకులు కోడూరు జయప్రద, సలహాదారు సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారు సుజాత, కార్యనిర్వాహక అధ్యక్షుడు కోడూరు జయరామ్, ముక్కాల వ్యాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెముడుగుంట వీఆర్వోపై దాడి

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట వీఆర్వో జుబేర్ అహ్మద్‌పై దాడికి జరిగింది. వివరాలు.. చెముడుగుంటకు చెందిన నితీష్, వెంకటేష్ గ్రామ సచివాలయానికి శనివారం వెళ్లి పొలానికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకంపై వీఆర్వోతో మాట్లాడారు. తన లాగిన్‌లో వర్క్‌ను పూర్తి చేశానని.. తహసీల్దార్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉందని ఆయన చెప్పగా, వాగ్వాదం చోటు చేసుకుంది. నితీష్ దాడి చేయడంతో వీఆర్వో చేతికి గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ అంకమరావు దర్యాప్తు చేస్తున్నారు.

నారాయణ అనుచరులపై పోలీసులకు ఫిర్యాదు

నెల్లూరు సిటీ: తనపై టీడీపీ నేత నారాయణ అనుచరులు దాడి చేశారంటూ మూలాపేటకు చెందిన ఓ మహిళ చిన్నబజార్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. మూలాపేటలో నారాయణ అనుచరులు కొందరు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానికుల నుంచి సర్వే నిర్వహించి.. వారి వద్ద ఫోన్ నంబర్, ఓటీపీని సేకరించారు. ఈ క్రమంలో తన ఫోన్ నంబర్‌ను ఎందుకివ్వాలని స్థానికురాలు అరుణమ్మ నిలదీయగా, నారాయణ వర్గీయులు గొడవకు దిగి దాడికి పాల్పడ్డారు. దీంతో దీక్షిత్‌బాబు, హరీష్‌పై పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు.

లారీ ఢీకొని వాహనచోదకుడి దుర్మరణం

వెంకటాచలం: స్కూటీని లారీ ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రామదాసుసత్రం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. వెంకటాచలం వైపు నుంచి గూడూరు వైపు స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీకొంది. ఘటనలో సుమారు 50 ఏళ్ల వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.45
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.8



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: రూ.95
లేయర్ (లైవ్)	: రూ.105
బ్రాయిలర్ చికెన్	: రూ.174
స్కిన్‌లెస్ చికెన్	: రూ.194
లేయర్ చికెన్	: రూ.178

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.